
# ఉరితాడు

విశ్వమోహిని



జీవితంలో మొదటిసారిగా త్రాగుడు ప్రారంభించాను నేను.

విస్కీ, బ్రాందీ.... ఇదీ, అదీ అని లేకుండా ఏది దొరికితే అది త్రాగుతూనే వున్నాను.

మూడు రోజులుగా అలా విడవకుండా త్రాగుతూనే వున్నాను, నన్ను నేను మరచిపోయేందుకు! ఈ ప్రపంచానికి దూరంగా వుండేదుకు!

త్రాగినప్పుడల్లా మత్తులో పడిపో

తున్నాను.... మత్తు వదిలినప్పుడల్లా మళ్ళీ త్రాగుతున్నాను.

అయినా—

మత్తు వదిలిన మరుక్షణం ఆ దృశ్యం నా కళ్ళముందు ప్రత్యక్షమవుతోంది. నన్ను మానసికంగా హింసిస్తోంది.

దానిని మరచిపోవాలని ప్రయత్నించే కొద్దీ నా స్మృతిపథంనుండి చెరగడం లేదది—

ఇరవై ఏళ్ళ రాజు వురికంబం ఎక్కుతూంటే నా మనసు గిలగిల కొట్టుకుంది.

అప్పుడే విచ్చుకుంటూన్న మొగ్గ—పూర్తిగా విచ్చుకోకుండానే త్రుంచివేయబడింది!

లోకమంటే ఏమిటో ఎరుగని అమాయకుడు జీవితపు తొలిమెట్టుపైనే వురికంబమెక్కడం-చరిత్రలోనే అపూర్వం! మానవజాతి చరిత్రకే మాయని మచ్చ!

డెత్ సెల్ నుండి బయటకొచ్చిన రాజు వదనం— నే నెలా మరచిపోగలను!

ఆ పసివాడి వదనంలోని బాధ.... వూహకందని భావాలు.... ఎన్ని బుడ్లు ఖాళీచేస్తే, ఎంత త్రాగితే మాత్రం మరుపు కొస్తాయి?

రాజు వదనం చూస్తూంటే గుండెలు పిండినట్లయింది నాకు.

ఆ అమాయక వదనంలో వుత్పన్నమయి, తేలుకొండిలా కనిపిస్తూన్న ప్రశ్న— నా హృదయంలో కలుక్కుమంది.

'ఈ సంఘం నాకు నేర్పినదేదో నేను చూశాను. ఇందులో నా తప్పేముంది? నా కెందుకీ శిక్ష?!' అన్న అమాయకపు ప్రశ్న రాజు వదనంలో గోచరించింది నాకు.

ఉరికి ముందురోజున ఇంటర్‌వ్యూ చేసేందుకు వెళ్ళాను నేను. ఇంతవరకు న్యాయస్థానపు చరిత్రలో లేని అంశం—ఇరవై ఏళ్ళ కుర్రాడికి వురిశిక్ష అనేది-పెద్ద అలజడి రేపింది. ఉరిశిక్షను రద్దు చేయాలని విజ్ఞులు వాదిస్తూన్న ఈ ఆధునిక యుగంలో, జీవితపు తొలిమెట్టుపైన అడుగుపెట్టిన ఓ యువకుణ్ణి వురి తీయడం అమానుషం, అక్రమం అంటూ గగ్గోలు పెట్టారంతా. కాని, చట్టం వుదాత్తమయినది. ముక్కుకు సూటిగా పోవడమే దాని లక్ష్యం. మనసు మాలిన చట్టం అనుభూతులకు అతీతం!

రాజుని ఇంటర్‌వ్యూ చేయాలనిపించింది నాకు. అంత పిన్న వయసులోనే వురికంబానికి దారిచూపిన పరిస్థితులను, స్థితిగతులను గూర్చి ఫస్ట్‌హ్యాండ్ ఇన్ఫర్మేషన్ సంపాదించాలన్న కుతూహలంతో అతికష్టంమీద అనుమతి సంపాదించాను. డెత్ సెల్‌లో రాజును కలుసుకున్నాను.... ఒక ముఠా ఆధ్వర్యంలో దోపిడీకి పూనుకున్న రాజు డబల్ మర్డర్‌లో ఇరుక్కున్నాడట!

అప్పుడే— రాజు నోటిమీదుగా అతని జీవిత చరిత్రను ఆలకించిన తరుణం

లోనే.... తెలిసింది నాకు— ఆ కుర్రాడు ఎవరో!

రాజును గుర్తించగానే నా నవ నాడులు క్రుంగిపోయినట్లయ్యింది.

ఎవరి కొరకైతే నిరంతర దీక్షతో రెండేళ్ళుగా గాలిస్తున్నానో.... అదే వ్యక్తిని డెత్‌సెల్‌లో.... ఆ విధంగా కలుసుకోవలసిరావడం... నా దురదృష్టం అంటే— తేలికైన పదం అది! నేను పగవాడిక్కూడా వాంఛించని శిక్ష అది!

మర్నాడు—రాజుని ఉరితీసే రోజు....

ఉరిశిక్షను అమలు జరిపేటప్పుడు పత్రికా విలేఖర్లను దరిదాపులకు రానివ్వడం జైలు అధికారులకు ఇష్టంలేని పని. అందుకే గత రాత్రంతా తీవ్రంగా ప్రయత్నించాను. ముఖ్యమంత్రిని కలుసుకుని అతి కష్టంమీద అనుమతి సంపాదించగలిగాను.

ఉషోదయయానికి ముందే సెంట్రల్ జెయిల్‌కి చేరుకున్నాను.

ఠాణాలో ఆరుగంటలు కొట్టగానే డెత్‌సెల్ తలుపులు తెరువబడ్డాయి.

కొత్త బట్టల్లో పెళ్లిపీటలమీద కూర్చోబోతున్న పెళ్లికొడుకులా అనిపించలేదు రాజు నాకళ్ళకు— బలికి సిద్ధం చేయబడిన గొర్రెపిల్లలా కనిపించాడు.

ఆ కుర్రాడి వదనంలో టెన్షన్!

జైలు సూపర్నెంట్ డెత్‌వారెంట్‌ను చదివి వినిపిస్తూంటే— రాజు ముఖంలో నరాలు బిగుసుకున్నాయి.

"రాజూ! నీ అంతిమ కోర్కె ఏదైనా వుంటే తెలపవచ్చును" అన్నాడు సూపర్నెంట్.

ఎందుకో చుట్టూ చూసాడు రాజు. అతనికళ్లు ఎవరికోసమో వెదుకుతున్నట్లున్నాయి. ఆ కళ్లలో నీటి తెరలు....

"అమ్మ.... మా అమ్మ కనిపించ లేదా?" పూడ్చుకుపోయిన గొంతును పెకల్చుకుని నెమ్మదిగా అన్నాడు రాజు.

అతని ప్రశ్నకు సమాధానంగా భయంకర నిశ్శబ్దత ఆవరించుకున్న దక్కడ.

ఆ ప్రశ్నకు జవాబు లేనట్లు.... ఆ కుర్రాడి కళ్లలోకి చూసే ధైర్యం చాల నట్లు.... మౌనంగా తల వంచుకున్నాడు జైలు సూపర్నెంట్.

నావంక చూసాడు రాజు. ఆ చూపు ల్లోని భావం నన్ను కదిలించివేసింది.

ఆ పసివాడి దైన్యవదనం చూస్తే— 'మీ అమ్మ చచ్చిపోయింది బాబూ! పై లోకంలో నీకోసం ఎదురుచూస్తోంది' అంటూ అరవాలనిపించింది నాకు.

కాని నన్ను నేను నిగ్రహించుకున్నాను.... చెబితే పర్యవసానం ఎలా వుంటుందో నాకు తెలుసు.... తన మరణవార్త కన్నతల్లికి అందకుండా పోతోందే అనీ, కడసారిగా ఆమె కంటి చూపుకు నోచుకోలేకపోయానే అనీ అతను బాధపడుతూండవచ్చును. కాని, అమ్మ జీవించే వుందన్న తృప్తి అతని

మనసులో వుంది. నిజం చెప్పి అ తృప్తిని చెరిపెయ్యడం నా కిష్టంలేదు. మరణ ఘడియలకు ముందు అతనిలో అసంతృప్తిని రేపి విషాదాన్ని పెంచడం నా అభిమతం కాదు. అమ్మ జీవించి వున్నదన్న నమ్మకంతోనే అతన్ని వురి కంబ మెక్కనీ అనుకున్నాను. అందుకే, గత దినం రాజు తల్లి ఆచూకీ గురించి వాపోతోంటే అతి కష్టంమీద నిజాన్ని వెల్లడించకుండా వుండగలిగాను.

పోలీసులు రాజు తల్లికోసం ప్రయత్నించి విఫలులయ్యారు. అసలు సత్యం ఎరిగినవాణ్ణి నేనొక్కణ్ణే!

రాజును డెత్ సెల్ నుండి బయటకు తీసుకొస్తూంటే— నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

బలిపశువును వధ్యశిలకు తీసుకుపోతున్నట్లు— ఆ కుర్రాణ్ణి వురికంబంవైపు నడిపిస్తూంటే టెన్షన్‌తో నా రక్తనాళాలు తెగుతాయా అనిపించింది.

ఆ పసివాణ్ణి—వురికంబ మెక్కించి....

ముఖానికి నల్లటి ముసుగు వేసి....

మెడకు వుచ్చు తగిలిస్తూంటే....

రాజు కంఠానికి త్రాడు బిగిసి, శరీరం కాళ్ళక్రిందనున్న గోతిలోకి అచేతనంగా వ్రేలాడుతూంటే....

నేను చూడగలనా!

చూసి భరించగలనా??

అ దృశ్యం వూహించుకుంటేనే— గుండెలు పిండినట్లుంది.

ఇక కళ్ళారా చూస్తే—??

ఆ దారుణ దృశ్యాన్ని కళ్ళతో చూడ్డానికేనా కష్టపడి అనుమతి సంపాదించాను?!

నో! అది నా వల్ల కాదు!

అడుగు ముందుకు పడలేదు నాకు.

అచేతనంగా, అపస్మారకంలో వున్నవాడిలా— వధ్యశిలకు అడుగులు వేస్తూన్న రాజూనే చూస్తూ వుండిపోయాను.

ఎందుకో హఠాత్తుగా ఆగాడు రాజు.

తల త్రిప్పి నా వంక చూసాడు.

అప్రయత్నంగా అతని చేతులు నాకు నమస్కరించాయి.

ఏమిటి ఈ అనుబంధం!?

రాజెవరో నాకు తెలుసు.

కాని, నే నెవరో రాజుకు తెలియదే!

అయినా, అంతిమ నమస్కారం నాకు చేయాలని ఎందుకు అనిపించింది అ కుర్రాడికి!?

ఇక ఒక్క క్షణం కూడా అక్కడ నిలుచోలేకపోయాను నేను. ఏ క్షణంలోనో భోరున ఏడ్చేటట్లుంది నా పరిస్థితి.

జైలు అధికారులు నా వంక ఆశ్చర్యంతో చూస్తూంటే, గిర్రున వెనక్కు తిరిగి సెంట్రల్ జెయిల్‌నుండి బయటకు నడిచాను.

## 2

బాటిల్ మూత తెరిచి గ్లాసులో వొంపుకున్నాను మళ్లీ. గడగడా త్రాగేసాను.




గొంతుకలో మంటగా వుంది.

గుండెల్లోని మంటకంటె ఈ మంటే నయమనిపించింది.

రెండు గ్లాసులు గొంతుకలో ఖాళీ కావడంతో, బుర్ర ఖాళీ అయిపోయింది .... ఆ దృశ్యం అదృశ్యమయిపోయింది.

ఏవో లోకాల్లో తేలిపోతూన్న నేను- కొంతసేపటికి నిషా దిగిపోవడంతో మళ్లీ వాస్తవంలోకి వూడిపడడం జరిగింది. ఏ సుఖమైనా క్షణికమేనా!?

జ్ఞాపకాలు నా కన్నుల ముందు కదిలాయి....

రెండేళ్ల క్రితం—

కాకినాడలోని ప్రభుత్వపు ఆసుపత్రిని గూర్చి ఏవో ఫిర్యాదులు ఆలకించడంతో, స్వయంగా పరిశీలించి ఇన్వెస్టిగేటివ్ రిపోర్ట్ వ్రాసే నిమిత్తం అచ్చటికి వెళ్లాను ఆ రోజు. హాస్పిటల్ సూపర్నెంట్ దగ్గరుండి ఒక్కో వార్డే చూపిస్తూ అచ్చటి వైద్యసదుపాయాలను, రోగుల నిమిత్తం తాము తీసుకుంటూన్న ప్రత్యేక శ్రద్ధలను గూర్చి వోపికగా వివరిస్తున్నారు.

ఆ సమయంలోనే- అనుకోకుండా జయను చూడడం సంభవించింది నేను.

సుఖవ్యాధులను నయంచేసే వార్డులో చావుబ్రతుకులమధ్య పోరాటాన్ని సాగిస్తోంది జయ.

తెల్లగా, బొద్దుగా, అందంగా వుండే

జయ ఇప్పుడు పీలగా, పాలిపోయి కాంతిహీనంగా వుంది. చక్రాలవంటి కళ్లొకటే ఇప్పుడామెకు మిగిలివున్నాయి. లోతుకుపోయిన ఆ కళ్లలో జీవం లేదు.

ఒకప్పుడు ఏ కళ్లను చూసి ఆమెను ప్రేమించానో— ఆ కళ్లే ఇప్పుడామెను గుర్తించడానికి దోహదంచేసాయి.

నాటి జయకూ, నేటి జయకూ ఎక్కడా పోలికలు లేవు. సరయిన పోషణ, ఆదరణ వున్నట్లు లేవు.

జయను ఆ స్థితిలో చూడగానే షాక్ తిన్నాను నేను.

జీవితంలో నేను ఎదురుచూడని దృశ్యం అది. నా వూహకు అతీతమయినది.

నేను వూహించుకున్న దేమిటి?

కన్నులముందున్న వాస్తవం ఏమిటి?

అనుకూలుడైన భర్తతో అనురాగ సుధలను గ్రోలుతూ బ్రతుకును నందనవనం చేసుకుందనుకున్న జయ....

ఇలా నిరాదరణలో చిక్కి శల్యమై దిక్కులేని పక్షిలా, ప్రభుత్వపు ఆసుపత్రిలో చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడడం....

నా వూహకు అందని విషయ మిది!

నన్ను గుర్తించిన జయ కన్నుల్లో మెరుపు.... వదనంలో వెలుగు....

కన్నీటిధారల మధ్య తన కథను వినిపించింది జయ.

ఆమె చెప్పింది ఆలకించి నిర్ఘాంత పోయాను.... ఆగ్రహావేశాలతో నా దవడ ఎముకలు బిగుసుకున్నాయి.

* * *

జయ భర్త నారాయణ మొదట్లో ఆమెను బాగానే చూసుకునేవాడు. కొడుకు పుట్టాక పిల్లాడంటే ప్రేమ కురిపించేవాడు. కాని, కొడుక్కి ఏదో ఏడు వచ్చేసరికి నారాయణ మరో స్త్రీని మరిగి జయనూ, కొడుకునూ నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టాడు.

అప్పటికే జయ తల్లిదండ్రులు మరణించడంతో, చేరదీయడానికి నా అన్నవారు లేకపోయారు. అటువంటి నిస్సహాయస్థితిలో కాకినాడలో ఏదో ఉద్యోగముందని ఆమెను కాకినాడ తీసుకువెళ్లి మోసంతో ఆమెను చెరచి, బుడంపేటలో ఓ 'కంపెనీ'కి అమ్మేసాడు ఒక నీచుడు. చావాలని చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో, కొడుకుకోసం మనసు చంపుకుని పరిస్థితులతో రాజీకి దిగింది. అసహాయురాలైన స్త్రీకి అనాదిగా వస్తోన్న మార్గమే ఆమెకూ శరణ్యమయింది.

ఎదుగుతూన్న పిల్లాడిమీద తన పాపపు జీవితపు నీడ పడకుండా బోర్డింగ్ స్కూలులో చేర్పించింది.

అయిదేళ్లు గడిచాయి—

జయ మనసు ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడు మనిషే మిగిలింది.

సెన్త్ చదువుతూన్న జయ కొడుకు దసరా సెలవులకు ఇంటికొచ్చాడు. ఆ రోజు రిక్షాలో సినిమాకు వెళ్లారు తల్లీ కొడుకులు. హాలు దగ్గర రిక్షా దిగి టికెట్స్ తీసుకురావడానికి వెళ్లాడు కుర్రాడు.

అతను తిరిగివచ్చేసరికి, ఒంటరిగా నిలుచున్న జయదగ్గరకొచ్చాడు ఒక వ్యక్తి. చనువుగా అమె బుగ్గ గిల్లి, "మరీ కుర్రాణ్ణి పట్టావ్. ఎక్కడ దొరి కాడు వీడు?" అన్నాడు వెకిలిగా నవ్వుతూ. అమె విటులలో ఒకడతను.

త్రాచుపామును త్రొక్కినట్లు తృళ్లి పడింది జయ. చటుక్కున దూరంగా జరిగి, "వాడు నా కొడుకు" అంది కంగారుగా.

ఆ దృశ్యం జయ కొడుకు కంట పడనే పడింది. పలుకులూ చెవినపడ్డాయి. ఆ వ్యక్తి అసభ్యకర ప్రవర్తన,పలుకులు జుగుప్సను, క్రోధాన్ని కలిగించడంతో రెప్పపాటులో ఆ వ్యక్తి మీదకు ఉరి కాడు, దెబ్బతిన్న బెబ్బులిలా. సన్నగా, పొడవుగా వున్న ఆ వ్యక్తిని గొంతు పట్టుకుని పిసికాడు ఆ కుర్రాడు. ఊపి రాడక గిలగిల కొట్టుకున్నాడతను– జయ విడిపించబోయింది. ఆ కుర్రాడు తోసిన తోపుకు అతను ఎగిరి వెనుకనున్న స్తంభంమీద పడ్డాడు. తల స్తంభానికి కొట్టుకోవడంతో అచేతనంగా నేలకు జారి పోయాడు. సున్నితమైన శిరోభాగంలో గట్టిదెబ్బ తగలడంతో వెంటనే ప్రాణం పోయింది.

ఫలితం– జయ కొడుకు రిఫార్మేటరీకి పంపబడ్డాడు. తన దుస్థితిని తలచుకుని దుఃఖించింది జయ. ఏ కొడుకు శ్రేయస్సు కోసమైతే తాను పడుపువృత్తిని చేపట్టిందో– ఆ కొడుకు తన మూలంగా 'జైలు'కు వెళ్లాడన్న సత్యాన్ని భరించ లేకపోయిందామె.... కొడుకు మీద బెంగతో అమె ఆరోగ్యం క్షీణించ సాగింది.

ఆ విధంగా మూడేళ్లు గడిచిపో యాయి. ఏ మహానుభావుడో పుణ్యం కట్టుకోవడంతో భయంకరమైన సుఖ వ్యాధులకు గురయి, ప్రమాదకర పరిస్థి తిలో పెద్దాసుపత్రికి వచ్చింది జయ.

* * *

మా కడసారి చూపులకే వేచివుందా అన్నట్టు తన విషాదగాథను నాతో చెప్పి, మర్నాడే కన్నుమూసింది జయ.

ఎవరి కేది రుణమో.... ఎలా తెలు స్తుంది!

దాదాపు ఇరవైఏళ్ల క్రితం దూరమైన ప్రియురాలిని చేతులారా మట్టిచేయడానికే నే నక్కడికి వెళ్లానేమో!

"మూర్తీ! నా బాబు ఎక్కడున్నాడో తెలుసుకుని వాణ్ణి సక్రమ మార్గంలో పెడతానని మాటియ్యగలవా?" అంటూ కన్నీటితో నన్నభ్యర్థించింది జయ, తన చేతిలో నా చేతిని వుంచుకుని.

"విచారించకు, జయా! నీకేం కాదు... బాబును వెతికిపట్టుకునే పూచీ నాది. నువ్వు నిశ్చింతగా వుండు" అంటూ హామీ ఇచ్చాను.

ఆమె కన్నులు తళుక్కుమన్నాయి. "నిశ్చింతగా వుండే రాతే నా జీవితానికి వుంటే నీ కెందుకు దూరమవుతాను, మూర్తీ!" అంది నిట్టూరుస్తూ.

జయ భద్రంగా దాచుకున్న కొడుకు ఫోటోను నా చేతిలో పెట్టింది. వాడిలో జయ పోలికలు కనిపిస్తున్నాయి.

డాక్టర్స్‌తో మాట్లాడి వెళ్లిపోయాను నేను. మర్నాడు వుదయం హాస్పిటల్‌కి వచ్చేసరికి జయ శవమే మిగిలింది.

జయను నా చేతులమీదుగానే దహనం చేసేసాను.

3

గ్లాసెత్తి గటగటా గొంతులో పోసుకున్నాను ఆ గరళాన్ని... అయినా ఆ స్మృతి పూర్తిగా చెదిరిపోలేదు. స్వప్నంలో వలె లీలగా మస్తిష్కంలో మెదులుతూనే వుంది.

హఠాత్తుగా బాల్యం తెరలుగా కదిలింది నాలో....

అంబాజీపేటలో నేనూ, జయా ఇరుగు పొరుగిళ్ల వాళ్లం. చిన్నప్పటినుండీ కలిసి ఆడుకున్నాం, కలిసి చదువుకున్నాం. నా కంటె రెండేళ్లే చిన్నది జయ. అయినా, ఎంతో ఆరిందాలా ఆ పిల్లమీద డామినేట్ చేస్తూండేవాణ్ణి ప్రతి విషయం లోనూ. నేను చెప్పినమాట వినక పోయినా, నేను ఔనన్నది కాదన్నా వెనకాముందూ చూడకుండా వుతికేసే వాణ్ణి. కోపం వస్తే కాలువగట్టున జయ కట్టుకున్న మట్టిగూళ్లను కాళ్లతో తన్నేసి, ఆ పిల్లను వొంగదీసి వీపుమీద గుద్దులు వేసేవాణ్ణి. పాపం, నిస్సహాయంగా చూస్తూ వెక్కివెక్కి ఏడ్చేదే తప్ప, ఇంట్లో మాత్రం చెప్పేదికాదు. ఆ పూటకు నా మీద అలిగేది. ఆ తరువాత మామూలే. వాళ్లింట్లో ఏ పిండివంటలు చేసినా నాకు తెచ్చిపెట్టనిదే తినేదికాదు. ఒక్కోసారి తాను తినడం మానుకునయినా నాకు తెచ్చిపెట్టేది. ఎప్పుడైనా కోపంతో నేను మాట్లాడకపోతే విలవిల్లాడిపోయేది. నా గడ్డంపట్టుకుని బ్రతిమలాడేది. అంతకూ మాట్లాడకపోతే ఏడ్చేసేది. నన్ను చూడకుండా వుండలేకపోయేది. నేనూ అంతే! ఎంత దుడుకుగ వున్నా, ఏ రోజునైనా జయ కనిపించకపోతే పిచ్చెత్తినట్టు పదిసార్లు వాళ్లింటి చుట్టూ తిరిగేవాణ్ణి....

వయసులు పెరిగేకొద్దీ మా అను రాగలత ప్రేమలతగా మారి పుష్పించడ సహజమైన మార్పుగానే అనిపించింది నాకు. మా తల్లిదండ్రులు సయితం మమ్మల్ని మొగుడూ, పెళ్లాలగానే జమ చేసి మాట్లాడుతూండడం సిగ్గూ, సంతోషమూ కూడా కలిగించేవి మాలో.

నేను స్కూల్ ఫైనల్ పాసయ్యే




సరికి జయ నైన్త్ పాసయింది. కాలేజి చదువుకి అమలాపురం వెళ్ళవలసి వచ్చింది నేను. అక్కడ మావయ్య ఇంట్లో వుండి చదువుకోమన్నారు. కాని, జయను చూడకుండా వుండలేను. అందుకే వుదయం బస్‌లో వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేవాణ్ణి. కాలేజ్‌నుండి రాగానే జయను వెదుక్కుంటూ వెళ్లేవాణ్ణి.

ఏవేవో క్రొత్తఅందాలను సంతరించుకుని మరింత అందంగా కనిపించేది జయ నా కంటికి. అదివరకటి చిలిపితనం, ముసిముసి నవ్వులకు చోటిచ్చింది. మునుపటిలా నాలో బాహాటంగా తిరగడానికి, ఆడుకోవడానికి సిగ్గుపడడం ప్రారంభించింది. ఆమె కన్నుల్లో ఏవో నూతన భావాలు, తళుకులు గోచరించేవి నాకు. ఏకాంతంలో సయితం నేను ముట్టుకుంటే వులికిపడేది. అది పులకరింతో, మరోటో బోధపడేది కాదు నాకు. నోటితో కంటె కళ్లతోనే ఎక్కువగా భాషించేది.

ఇంటర్ పూర్తిచేసి డిగ్రీలో అడుగు పెట్టాను నేను. జయ స్కూల్‌ఫైనల్ పాసయి ఇంట్లో కూర్చుంది. ఆడపిల్లకు ఆ చదువు చాలనీ, ఇక వివాహమే తరువాయి అనీ ఆమె తల్లిదండ్రుల అభిప్రాయం.

ఓ శుభదినాన జయతండ్రి మా పెళ్లి విషయం మా నాన్నగారి దగ్గర కదపడమూ, 'ఇప్పుడే ఏం తొందరోయ్? మూర్తిని డిగ్రీ తీసుకోనీ' అని జవా

బివ్వడమూ జరిగాయి. అంతవరకు ఆగ గలిగితే తమ కభ్యంతరం లేదన్నారు ఆయన.

ఆ సంగతి విని మా సంతోషానికి మేరలేకపోయింది. ఆ సాయంత్రం కాలువగట్టున ఆనందంతో జయ నడుం పట్టుకుని గాలిలోకి ఎగరేసాను, ఆమె గోలపెడుతున్నా వినిపించుకోకుండా.... తోటలో మామిడిచెట్ల మధ్య జయను కౌగిట్లో బంధించి ముఖమంతా ముద్దుల వర్షం కురిపించాను. బలవంతాన నన్ను విడిపించుకుని కొంటెగా నాలుక బయటకు పెట్టి నన్ను వెక్కిరించి పారిపోయింది జయ.

డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలు ఆ నాటితో ముగిసాయి.... ఫాన్సీ షాపులో జయకు క్రొత్త రిబ్బన్, నెయిల్‌పాలిష్, తిలకం సీసాలు కొనుక్కుని బస్టాండుకు వచ్చేసరికి గన్నవరం బస్సు వెళ్లి పోయింది. మరో అరగంట వరకు మా వూరు వెళ్లే బస్సు లేదు.

బస్టాండులో రోడ్డుప్రక్క నెవరో జ్యోతిష్యం చెబుతూంటే వుబుసుపోకకు అక్కడ నిలుచున్నాను. ఎవరెవరో వచ్చి చేతులు చూపించుకుని సంతృప్తి చెందు తున్నారు. 'డిగ్రీ క్లాసులో పాసవుతానా? జయతో నా పెళ్లెప్పుడవుతుంది?' అన్నది తెలుసుకోవాలని వుంది నాకు. కాని, నడి రోడ్డులో చేయి చూపించుకోవడానికి సిగ్గుగా వుంది. నా వాలకం కనిపెట్టాడో ఏమో, చొరవగా నా చేయి అందుకున్నా డతను. నా జాతకం దివ్యంగా వుంద న్నాడు. చివరకు చావు కబురు చల్లగా చెప్పాడు— నాకు పెళ్లికాగానే భార్య మరణించే యోగం వుందని!

అంతే!....

జయను చేసుకోవడం నా కిష్టంలేదని చెప్పేసాను ఇంట్లో. కారణం అడిగితే చెప్పలేదు.... జయను వదులుకొని నేను వుండలేను. అలాగని స్వార్థంకోసం నా ప్రాణానికి ప్రాణమైన ప్రియురాలిని మృత్యువుకు ఆహుతి చేయలేను. నా నిర్ణయం రెండిళ్లలోనూ పెద్ద దుమారాన్ని రేపింది.

కాలువలో వురికి ఆత్మహత్య చేసుకో బోయింది జయ. దేవుడు పంపినట్లు సమయానికి నేను అటువైపు వెళ్లడంతో రక్షించుకోగలిగాను. నా గుండెలపైన తల పెట్టుకుని గుండెలవిసేలా రోదిం చింది ఆమె. ఎలా వోదార్చాలో తెలియ లేదు. అసలు విషయం చెప్పక తప్పలేదు.

జ్యోతిషం పిచ్చితో మన బ్రతుకులు నాశనం చేసుకోవద్దంది జయ. నాతో జీవితం మూన్నాళ్ల ముచ్చటైనా చాలంది. మరొకడితో తనువు ముడివేసుకోలేనని ఏడ్చింది. ఆమెను వూరడించడం కష్ట మయిపోయింది. ఆమె సుఖంగా వుండ డమే నా అభిమతమనీ, పెద్దలు చూపిన వ్యక్తిని పెళ్లాడి నా కానందం కలిగించ మని కోరుకున్నాను. చెప్పిన మాట విని

పించుకోకపోతే మళ్లీ ఆమె కంటికి కనిపించకుండా వెళ్లిపోతానని బెదిరించాను.

మూణ్ణెల్లకే జయ, నారాయణ భార్య అయింది. పెళ్లిపీటలమీద పరాయివ్యక్తి ప్రక్కనున్న జయను చూసి తట్టుకోలేకపోయాను. నా ప్రాణం బలవంతంగా నా నుండి వేరయిపోతున్నట్లు బాధ.... చాటుకు వెళ్లి బాగా ఏడ్చాను.

జయ భర్తతో అమలాపురం అత్తవారింటికి వెళుతూ మా యింటికొచ్చింది. రహస్యంగా నా కాళ్లకు మ్రొక్కింది. వెళ్లబోతూ దుఃఖం ఆపుకోలేక నా హృదయంపైన వాలిపోయి భోరున ఏడ్చింది. నాకు తెలియకుండానే కన్నీటితో ఆమె తలను తడిపేసాను నేను.

జయ వెళ్లిపోయింది.

నా నవనాడులూ కృంగిపోయాయి.

నాలో విపరీతమైన మార్పు వచ్చింది. బయటకు వెళ్లడం పూర్తిగా మానుకున్నాను. ఎప్పుడూ గదిలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటూ వుండే వాణ్ణి.

ఆ వూర్లో వుండలేక జర్నలిజం చదువుతానని చెప్పి మద్రాసు వెళ్లిపోయాను. జర్నలిజంలో డిగ్రీ తీసుకోగానే ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా మారిపోయాను.

అటు జయను మరిచిపోలేక, ఇటు మరో పిల్లను పెళ్లాడి మృత్యువుకు బలి చేయలేకా జయతో గడిపిన మధుర క్షణాలను గుండెల్లో పదిలంచేసుకుని ఆ తీయని జ్ఞాపకాలతో కాలం గడిపేయసాగాను.

మావాళ్లు పెళ్లిచేసుకోమని పోరి, అలిసిపోయి, నా పైన అలిగి కన్నుమూసారు. ఒంటరివాడిగా మిగిలిపోయాను. ఆ తరువాత నాకు అంబాజీపేటతో సంబంధం పూర్తిగా తెగిపోయిందనే చెప్పాలి.

హైద్రాబాద్ చేరుకున్నాను.

అన్నేళ్ల తరువాత కాకినాడ వెళ్లడమూ, అక్కడ జయ కనిపించడమూ జరిగాయి. అటువంటి దైన్యస్థితిలో జయ కనిపిస్తుందని కలలోకూడా అనుకోలేదు నేను.

*  *  *

జయ!.... ఎటువంటి కుటుంబం నుండి వచ్చింది! ఎటువంటి జీవితాన్ని గడిపింది! చివరకు ఎటువంటి దారుణ మరణానికి గురయింది! విధి ఎంత కౄరమైనది.

జయ కొడుకు వున్న రిఫార్మేటరీని వెదుక్కుంటూ వెళ్లాను. అచ్చట ఆలకించిన విషయం నన్ను నిర్ఘాంత పరచింది. రెండేళ్ల తరువాత అచ్చటి నుండి తప్పించుకుని పారిపోయాడట ఆ కుర్రాడు!

జయ భర్తపట్ల నాలో కక్ష పెరిగిపోయింది. ఆ దుస్థితికి అతడే కారకుడు!

అతని మూలంగానే జయ బజారుపా లయింది. నా ప్రియురాలి జీవితాన్ని, ఆమె బిడ్డ బ్రతుకును సర్వనాశనం చేసిన నీచుడతను. అతని మూలంగానే వారి కాగతి పట్టింది. జయ మరణించ లేదు. హత్య చేయబడింది! అతన్ని దేవుడు క్షమించినా, నేను మాత్రం క్షమించలేను.

అతన్ని ఏదో చేయాలన్న ఆవేశం కలిగింది నాలో.

అమలాపురం వెళ్లాను, నారాయణకు బుద్ధి చెప్పాలని. కాని, అతనక్కడ లేడు. అయిదేళ్ల క్రితమే పొట్ట చేత బట్టుకుని హైద్రాబాద్ వెళ్లిపోయాడని తెలిసింది. అతని చిరునామా తెలియ లేదు.... హైద్రాబాద్ తిరిగొచ్చాను. ఎప్పుడైనా, ఎక్కడైనా కనిపించక పోతాడా అని ఎదురుచూస్తూనే వున్నాను. అటు నారాయణ కానీ, ఇటు జయ కొడుకు కాని కనిపించలేదు—

## 4

మర్నాడు నా మిత్రులు ఫొటో గ్రాఫర్ స్వామి, ఓ పత్రికా విలేఖరి రమణా వచ్చారు నన్ను వెతుక్కుంటూ.

"ఏమిటి గురూ. మరో దేవదాసులా తయారయ్యావ్? నీ పార్వతి ఎక్కడైనా కనిపించిందేమిటి?" అని జోక్ చేసి, తానే నవ్వుకున్నాడు స్వామి పెద్దగా.

"ఒక ముఖ్యమైన వ్యక్తిని కష్టపడి పట్టుకున్నాం. ఇంటర్వ్యూ చేద్దాం, రా" అన్నాడు స్వామి మళ్లీ.

అతనూ, నేనూ కలిసి ఇంటర్వ్యూలను చేయడం, ఆర్టికిల్స్ రాయడం అలవాటు. నేను ఇంటర్వ్యూ చేస్తే, అతను ఫోటోలు తీస్తూంటాడు.

"ఎవరతను?" అన్నాను నిరాసక్తంగా.

"అమ్మమ్మ! ఆ విషయం ఇప్పుడే చెప్పేస్తే సస్పెన్స్ వుండదు" అన్నాడు స్వామి. "త్వరగా బయలుదేరు."

"సారీ, నేనిప్పుడు ఎవరినీ ఇంటర్వ్యూ చేయలేను" అన్నాను.

"చూడు బ్రదర్! కొత్త బిచ్చగాడికి ప్రొద్దు తెలియదట! ఏం కొంప మునిగిందని హఠాత్తుగా దేవదాసు వైపోయావ్? ఇలా ఇరవైనాలుగ్గంటలూ త్రాగుతూ కూర్చుంటే ఏమైపోతావో ఆలోచించావా? అసలు నీ కొచ్చిన కష్టమేమిటి?" అంటూ మెత్తమెత్తగా చివాట్లు వేసాడు రమణ.

"సమయం వచ్చినప్పుడు కారణం నేనే చెబుతానుగాని, ఇప్పటికి నన్ను విడిచి పెట్టండి" అన్నాడు.

వాళ్లు విడిచిపెట్టలేదు. బలవంతంగా నన్ను లాక్కుపోయారు, ఆ అవకాశం జారవిడిస్తే మళ్లా ఆ వ్యక్తి దొరకటం కష్టమంటూ.

* * *

మా ఎదుట కూర్చున్న ఆ వ్యక్తిని చూడటంతో నా భ్రుకుటి ముడివడింది. పుష్టిగా, పొడవూ, పొట్టీ కాకుండా యువ




చామనఛాయలో వున్నాడు. అతన్ని ఎక్కడో చూసినట్లనిపించింది.

అతను కూడా నా వంక అదోలా చూడటం గమనించాను. బహుశా నన్ను గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తున్నాడేమో నాలాగే.

హఠాత్తుగా నా మెదడులో మెరుపు మెరిసింది. నా ముఖంలోని నరాలన్నీ ఒక్కసారిగా బిగుసుకున్నాయి.

"ఇక ఇంటర్వ్యూ ప్రారంభించుదామా?" అన్నాడు స్వామి.

నా అనుమానం దృఢపరుచుకోవాలి ముందు. "వెయిట్ ఎ మినిట్..., ముందు నేనో కథ చెబుతాను మీకు. ఆ తర్వాతే ఇంటర్వ్యూ."

నా వంక ఆశ్చర్యంగా చూసారు స్వామి, రమణలు. స్వామి ఏదో అనబోతే చేత్తోనే వారించి కథ ప్రారంభించాను.

అంతా నిశ్శబ్దంగా ఆలకిస్తూంటే నా బాల్యంనుండి ప్రారంభించి, రాజు వురి తీయబడ్డంతవరకు జయ కథంతా చెప్పాను.

కథ చెబుతూన్నంతసేపూ ఆ వ్యక్తి వదనాన్ని అందులో కలిగే మార్పులను జాగ్రత్తగా గమనిస్తూనే వున్నాను.

ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని ఆలోచిస్తూ వుండిపోయారు స్వామి, రమణలు.

"నీ జయ కథకూ, రాజు వురికీ సంబంధమేమిటి?" అని ప్రశ్నించాడు స్వామి విస్తుపోతూ.

"రాజే జయ కొడుకు!" జవాబిచ్చాను నేను కసిగా, క్రూరంగా, ఆ 'వ్యక్తి' ముఖంలోకి చూస్తూ.

ఉలిక్కిపడ్డాడతను.... వదనం పాలి పోయింది. మనిషి వొణికిపోతున్నాడు. నోరు సగం తెరుచుకుని, మళ్ళీ మూసు కుంది. బహుశా ఏదో అనబోయి మూసు కుని వుంటాడు.

"రాజును ఇంటర్వ్యూ చేయడంతో అతని చరిత్ర విని, నేను వెదుకుతూన్న జయ కొడుకు అతనేనని గ్రహించాను. జయ నాకిచ్చినది రాజు ఫోటోయే. అతను కనిపించాడన్న సంతోషం కంటే వ్యధే అధికమయింది నాకు" చెప్పుకుపోయాను నేను. "రిఫార్మెటరీలోని జీవితాన్ని భరించలేక అక్కడినుండి తప్పించుకు పారిపోయానన్నాడు. బయటకు రాగానే స్మగ్లర్స్ చేతుల్లో పడ్డాడట. తమ వృత్తిలో ఆ కుర్రాడికి బాగా తర్ఫీదు ఇచ్చారు వాళ్ళు. వాణ్ణి తమ గుప్పెట్లో ఉంచుకుని తమ దుండగాలలో వుపయో గించుకునేవారు. ఆ సందర్భంలోనే తప్పనిసరిగా హత్యలు చేయవలసివచ్చిన రాజు పోలీసులకు చిక్కిపోవడం జరిగింది."

ఉద్రేకాన్ని అపుకోవడం నా తరం కాకుండా పోతోంది. ఆవేశంతో నా రక్తం పొంగుతోంది.

సందేహంలేదు- అతనే!.... ఆ ముఖ భావాలే చెబుతున్నాయి.

"నారాయణ కనిపించలేదా?" ప్రశ్నిం చాడు రమణ.

"కనిపించాడు!" అన్నాను.

"ఎప్పుడు?" కుతూహలంగా అడిగాడు రమణ.

"ఇప్పుడే."

"ఎక్కడ?" ఆతృతగా ప్రశ్నించాడు స్వామి.

"ఇక్కడే!" చటుక్కున లేచి నిలు చున్నాను.

ఆ క్షణంలో నా ముఖం అత్యంత భయంకరంగా కనిపించి వుండాలి ఆ ముగ్గురికీ. నా కళ్ళలో మృత్యువు రూపం ప్రతిఫలించివుంటుంది. పగ, ప్రతీకార కాంక్ష, కసి, కోపం వొక్కుమ్మడిగా పెనవేసుకోవడంతో శరీరమంతా కంపిస్తోంది.

నా రూపం చూసి త్రుళ్ళిపడి పైకి లేవబోయాడా వ్యక్తి. అందు కవకాశం ఇవ్వలేదు నేను. రెండు చేతులూ చాచి అతని కంఠం అందుకున్నాను.

అతనిముఖంలో మృత్యుభీతిస్పష్టంగా తాండవమాడుతోంది. కళ్ళలో భయం, బాధ, అర్థింపు.... నా చేతులను విడిపించు కోబోయి ఆగిపోయాడు!

"మూర్తీ!" అంటూ అరిచి నామీదకు ఉరికారు స్వామి, రమణలు.

"ఏమిటిది? నీకేమైనామతిపోయిందా!" అరిచాడు స్వామి, నా పట్టు విడిపిస్తూ.

"నా జయ బ్రతుకు బుగ్గిచేసిన ఆ నారాయణ వీడే!" అంటూ పట్టు బిగించ బోయాను నేను.

రమణ నా చేతులు విడిపిస్తూంటే, "ఒద్దొద్దు.... అతన్ని ఆపకండి....చంప నివ్వండి" అన్నాడు ఆ వ్యక్తి.

తెల్లబోయాను నేను.

"ఆలోచించొద్దు ప్లీజ్! నన్ను చంపెయ్!" అంటున్నాడు నారాయణ నాతో. అతని గొంతులో జీర!

పశ్చాత్తాపమా....!?

హఠాత్తుగా అనిపించింది నాకు-"నో! ఈ దుర్మార్గుణ్ణి ఇంత సులభంగా చంప కూడదు.... పశ్చాత్తాపంతో జీవితమంతా కుమిలి కుమిలి ఏడవాలి! వీణ్ణి చంపి నా చేతులు మలినం చేసుకోను."

చటుక్కున పట్టు వదిలేసాను.

"ఛీ! నీ ముఖంచూస్తే పాపం చుట్టు కుంటుంది! ఫో, ఇక్కడనుండి...." అంటూ అరిచాను.

అతని ముఖభావాలు వర్ణనాతీతం. బాధ, ఆవేదన.... స్పష్టంగా గోచరిస్తు న్నాయి.... కళ్ళలో నీటిపొరలు....

నెమ్మదిగా లేచి రెండడుగులువేసాడు. అంతలోనే ముందుకు తూలాడు. చూస్తూ ఉండగానే గుండె చేత్తోపట్టుకుని కుప్పలా కూలిపోయాడు.

నిర్ఘాంతపోయాను నేను.

రమణ, స్వామి అతనివైపు పరుగెత్తారు.

"మూర్తీ! ఏమిట్రా ఇదంతా? ఇతన్ని చూసి ఎవరనుకుంటున్నావో! ఉరిశిక్షపైన ఆర్టికల్ రాయాలనుకున్నాం కదూ మనం? అందుకే అతికష్టంమీద ఇతన్ని ఇంటర్వ్యూకి ఒప్పించాను...."అన్నాడు అతని నాడి చూస్తూ.

నా చూపులు అచేతనంగా పడివున్న నారాయణమీదే ఉన్నాయి.

"ఇతను-అఫీషియల్ ఎగ్జిక్యూషనర్ రాజును ఉరితీసింది ఇతనే!" అన్న రమణ పలుకులతో నా తలమీద పిడుగు పడినట్లయింది.

"మై గాడ్! ఇతని గుండె ఆగిపో యింది!" అన్న స్వామికేకతో, కొయ్యబారిపోయి వెర్రిగా, అచేతనంగా చూస్తూ వుండిపోయాను.

